



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

బాధ్యతగా పనిచేయాలి : ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పోలీస్ శాఖలో నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పని చేసి కేసులలో పురోగతి సాధించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మట్కా గ్యాంబ్లింగ్ అక్రమ మద్యంపై ఉక్కు పాదం మోపాలని ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పలు కేసులలో దోషులకు శిక్ష పడటం శుభ పరిణామం అని అన్నారు. దీనిద్వారా పోలీసుల పై ప్రజలలో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. నేరాల్లో పాలు పంచుకున్న వారు ఎవరైనా ఎంతటి వారైన సరే చట్టం ద్వారా వారికి శిక్ష పడేలా దర్యాప్తు చేయాలని కేసులు కోర్టుల్లో వీగిపోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, బందోబస్తు వేసినప్పుడు సిబ్బంది ఉన్నారా లేదా అన్న విషయాలను పోలీసు అధికారులు గమనించాలని అన్నారు. ప్రధానంగా పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వీలైనంత వరకు వాటిని తగ్గించాలని సూచించారు. అలాగే జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలలో పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందేలా మెలగాలన్నారు. పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా వ్యవహరించాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా కొనసాగించాలన్నారు. అనుమానాస్పదంగా మృతిచెందిన చెందిన కేసులలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నాలుగు రోడ్ల కూడలిలో పబ్లిక్ మీటింగులు నిర్వహించినప్పుడు విఐపిలు వెళ్లే విధంగా ఒక రోడ్డును పూర్తిగా పోలీసుల అధీనంలో పెట్టుకోవాలని చెప్పారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులలో దర్యాప్తు కేసు ఫైల్ నిర్వహణ సాక్షులు విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో జిల్లా పోలీస్ శాఖ అందరూ సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విష్ణు, జిల్లా పరిధిలోని ఎస్డిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక సాధికార యాత్ర

సామాజిక మద్దతు లభించేనా. ?

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో వైసిపి బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీల మద్దతు కూడగట్టేందుకు యాత్రలను చేపట్టింది. ప్రధానంగా బీసీ, ఎస్సీ జనాభా అధికంగానున్న నియోజకవర్గాలపై దృష్టి సారించింది. ఇక్కడ ఈ యాత్రల ద్వారా మద్దతు కూడగట్టే ప్రయత్నం చేపట్టింది. సామాజిక తరగతులకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించామని చెప్పే ప్రయత్నం వైసిపి చేపడుతోంది. అయితే సామాజిక ప్రాధాన్యత కేవలం రాజకీయ పదవుల్లోనేనా... అన్న చర్చ మాత్రం విపక్షాల నుంచి నడుస్తోంది. ఈ సామాజిక తరగతులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయి. ఈ తరగతులు విద్య, ఆర్థికం ఎదగటానికి గతంలోనున్న అనేక పథకాలు ఈ నాలుగన్నరేళ్ల కాలంలో అమలుకు నోచుకోలేదు. మరోవైపు దళితులపై దాడులు జరిగిన ఘటనలు అనేకమున్నాయి. వివక్ష పెద్దఎత్తున కొనసాగుతూనే ఉంది. వీటి నిర్మూలనకు తీసుకున్న చర్యలేవి కనిపించటం లేదు. ఇటువంటి చర్యలేవి తీసుకోకుండా సామాజిక మద్దతు కూడగట్టడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు సామాజిక సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. కేవలం రాజకీయ పదవులు, అది కూడా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించినంత మాత్రాన సామాజిక సాధికారత సాధ్యమవుతుందా అన్న ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. వీటిని వైసిపి ఈ యాత్ర ద్వారా ఏ మేరకు నివృత్తి చేయగలదో చూడాల్సి ఉంది.



◆ శింగనమలలో నేడు ప్రారంభం ◆ హాజరుకానున్న వైసిపి ముఖ్య నేతలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


'సామాజిక సాధికార యాత్ర' పేరుతో వైసిపి చేపట్టిన బస్సు యాత్ర నేడు అనంతపురం జిల్లాలో ప్రారంభం కానుంది. రాయలసీమ జిల్లా వ్యాప్తంగా ఈ యాత్ర సాగనుంది. జిల్లాలోని శింగనమల నియోజకవర్గంలో ఈ యాత్ర ప్రారంభం కానుంది. ఉదయం శింగనమల మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్లో ప్రారంభమై మధ్యాహ్నం మూడు గంటలకు బుక్కరాయసముద్రం చేరుకుంటుంది. అక్కడ అంబేద్కర్ సర్కిల్లో బహిరంగ సభను నిర్వహించనున్నారు.

హాజరు కానున్న ముఖ్య నేతలు

రాయల సీమలో ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభ కార్యక్రమానికి వైసిపి ముఖ్య నేతలు హాజరుకానున్నరు. జిల్లా ఇన్ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరవుతున్నారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్, అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్య తదితరులు పాల్గొననున్నారు.

ఏర్పాట్లు సిద్ధం

ఈ యాత్రను పెద్దఎత్తున జయప్రదం చేసేందుకు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిలు ఏర్పాట్లను చేపట్టారు. తమ నియోజకవర్గం పరిధిలో నుంచి ఈ యాత్ర ప్రారంభం కానుండటంతో తొలి కార్యక్రమాన్ని ఘనవిజయం చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రహదారి పొడవునా కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో ఎన్నికలు కూడా రానున్న నేపథ్యంలో ఒక రంగా బల ప్రదర్శన చేపట్టాలన్న యోచనలోనూ వీరున్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీద్దాం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

విద్యార్థుల్లోని సృజనాత్మకతకు వెలికి తీయడానికి ప్రభుత్వం ఎస్ఇఎస్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తోందని ఎంఇఒ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండల రిసోర్స్ సెంటర్లో బుధవారం మండలంలోని సిఎంఆర్ టీముతో సమావేశం నిర్వహించారు. ఈనెల మూడవ తేదీన 3 ,6, 9 వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులకు ఆయా పాఠశాలల్లోనే పరీక్షల నిర్వహిస్తారని, మూడు ,ఆరు తరగతులకు 45 మార్కులు, 9వ తరగతికి 60 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తామని లాంగ్వేజ్ లతో పాటు, గణితంపై పరీక్షలు ఉంటాయని అన్నారు. మండల వ్యాప్తంగా 1248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి 50 మందిని నియమిస్తున్నామని తెలిపారు. వారికి ఈ నెల 27న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని, రిటైర్డ్ టీచర్లు, టెట్టు , డిగ్రీ పూర్తి చేసిన వారికి ఇన్విజిలేటర్లుగా అవకాశం కల్పిస్తామని వివరించారు. వారికి 650 రూపాయలు పారితోషకం చెల్లిస్తామని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్టిలు ఓబులేసు, శంకరప్ప, ప్రశాంతి, నాయక్, వనిత తదితరులు పాల్గొన్నారు.



తెగుళ్లు సోకి ఆకులేక కర్రలు మాత్రమే మిగిలిన ఆముదం మొక్కలు

ఆముదంకు తెగుళ్లు

'నామాల'తో పంట నాశనం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ప్రతి ఏటా వేరుశనగ సాగు చేసిన రైతులకు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట చేతికందకుండా పోయింది. పెట్టుబడులు కూడా చేతికరాక అప్పుల ఊబిలో కూరకుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించారు. అందులో భాగంగా గుంతకల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ఆముదం పంట సాగుపై దృష్టి సారించారు. తక్కువ వర్షం, తక్కువ ఖర్చు అయ్యే ఆమదును రైతులు సాగు చేశారు. మండల పరిధిలో దోసలుడికి, సంగాల, కసాపురం, అమిన్పల్లి తదితర గ్రామాల్లో దాదాపు వంద హెక్టార్లలో ఈ పంటను సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకి రూ.10వేల నుంచి నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతంది. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో దీనికి తెగుళ్లు సోకుతున్నాయి. ముఖ్యంగా నామాల అనే తెగుళ్ల పంటను పూర్తి స్థాయిలో దెబ్బతీస్తున్నాయి. నామాల పురుగు ఆశించి ఆముదం ఆకులు, పూతను పూర్తిగా తొలిచివేస్తోంది. చెట్టుకు బర్రలు తప్ప ఏమీ మిగలడం లేదు. పురుగు సంహారానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం శూన్యంగా ఉంది. పురుగు ఆకు కింది భాగాన్ని ఆశించి ఆకులు, పూతను పూర్తిగా తినేస్తోంది. ఈ పురుగు నివారణకు క్రిమిసంహారక మందులు అధికంగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడులూ విపరీతంగా పెరుగుతున్నాయి. ఇలా చేసినా పంట చేతికొచ్చే పరిస్థితి కన్పించడంలేదు. ఆకులు పూర్తిగా తెగుళ్ల బారిన పడడంతో రైతులు చేసేది లేక పంటను తొలగించేస్తున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి తెగుళ్ల సోకిన ఆముదం పంటను పరిశీలించి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి, పంటను పూర్తిగా నష్టపోయిన వారికి ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఐదుగురికి చం.స్పందన పురస్కారాలు

అనంతపురం కలెక్టరేట్ : చం.స్పందన ఆత్మీయ సాహితీ పురస్కారం 2022 సంవత్సరానికి ఐదుగురు ఎంపికైనట్లు 'స్పందన' అనంతకవుల వేదిక అధ్యక్షులు తూముచర్ల రాజారామ్, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర శాస్త్రి బుధవారం తెలిపారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు హైదరాబాదుకు చెందిన కవి కృపాకర్ మాదిగ రాసిన "పంచుకుందాం రా" బహుజన మహాకావ్యానికి లభించినట్లు తెలిపారు. 'స్పందన' అనంత కవుల వేదిక ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచిన సందర్భంగా 'స్పందన' ద్విదశాబ్ధి ప్రత్యేక పురస్కారాలు మరో నలుగురికి అందజేయాలని సంస్థ నిర్ణయించినట్లు తెలిపారు. 'స్పందన' ద్విదశాబ్ది విశిష్ట పురస్కారాలను అందుకున్న వారిలో "మా నాయిన పాట" కవితా సంపుటి రాసిన కాకినాడకు చెందిన కవి సుంకర గోపాలయ్య," కల్లంచుల బువ్వ" దీర్ఘ కవిత రాసిన కళ్యాణదుర్గంకు చెందిన కవి ఇ.రాఘవేంద్ర, "మొలగొలుకు చేను" కవితా సంపుటి రాసిన నెల్లూరుకు చెందిన కవి పేరిశెట్ల శివకుమార్, "పూల నిప్పులు" కవితా సంపుటి రాసిన ఆదోనికి చెందిన కవయిత్రి స్వయంప్రభ ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 19న ఆదివారం అనంతపురంలో నిర్వహించే పురస్కార గ్రహీతలకు నగదు బహుమతులతో పాటు ఘనమైన కవి సత్కారంతో పురస్కారాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

29న అనంతలో సిపిఎం సెమినార్

◆ జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలపై చర్చ ◆ బ్రోచర్ల ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి- ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన జిల్లా స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్లో ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ సెమినార్ను అనంతపురం తపోవనంలోని రేడియంట్ ఫంక్షన్హాల్లో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అభివద్ధి అంటే కొద్ది మంది వ్యక్తులు కుబేరులుగా మారి వారి సంపదను పెంచుకోవడమా..? లేక అత్యధిక ప్రజల జీవితాల్లో పురోగతి సాధించడమా? అని ప్రశ్నిస్తే ప్రజల అభివద్ధే నిజమైన అభివద్ధి అని అందరూ చెబుతారని తెలిపారు. తరతరాలుగా వెనుకబడిన జిల్లా ప్రజల అభివద్ధికి ప్రత్యేక ప్రణాళికలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు చేయాలని అనేక కమిటీలు సిఫార్సులు చేశాయని తెలిపారు. తద్వారా వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, ప్రభుత్వ విద్యా, వైద్యం, సామాజిక తరగతుల అభివద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించాయని తెలిపారు. కొత్త అనంతపురం జిల్లా ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతోందని, రాష్ట్రం చీలి ఒక దశాబ్దం దాటుతోందన్నారు. కానీ జిల్లా సమగ్రాభివద్ధి కోసం ప్రభుత్వాలు ఏమి చేయాలి? అనే అంశంపై ఒక్క సమీక్ష కూడా సమగ్రంగా జరగలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా ప్రజల ఆకాంక్షలు ఏమిటీ? ప్రభుత్వాల ప్రాధాన్యతలో అనంతపురం జిల్లా ఎందుకని లేదు? అప్పర్భద్ర, కష్ణా, జలాల పున్ణపంపిణీపై జరుగుతున్న చర్చ సందర్భంలో అనంతపురం సాగునీటి పరిస్థితి ఏమిటీ? నూతనంగా జిల్లాలో ఒక్క పరిశ్రమ స్థాపించకుండా యువతకు ఉపాధి ఎలా కలిపిస్తారు? విద్యా, వైద్యం ఖరీదైన వ్యాపారంగా మారుస్తూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ప్రజల భవిష్యత్ ఎలా అభివద్ధి చేస్తారు? వివిధ అంశాలపై చర్చించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో నిష్ణాతులైన ప్రముఖులు సెమినార్కు హాజరవుతున్నారని తెలిపారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన హెచ్డిఎస్ కమిటీ సమావేశంలో ఛైర్మన్ హోదాలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులను ధీటుగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కలెక్టర్ అరుణ్బాబు అన్నారు. మండలంలోని మొటుకుపల్లి సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యశిబిరంలో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, ఎంపిడిఒ అంజినప్ప, మండల ప్రత్యేక అధికారి సుబ్బా రావు , తహశీల్దార్ సునీత ,మున్సిపల్ కమిషనర్ శ్రీ.హరిబాబు తదితర అధికారులతో పాటు మొటుకుపల్లి సర్పంచి రూప నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని పులేరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని జీనవాండ్లపల్లి, మరెడ్డిపల్లి, కొత్త బోయినపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఈ వైద్య శిబిరంలో వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ప్రభాకర్ రావు, వెంకటరమణ పల్లి పంచాయతీ సర్పంచి అశ్వత్ రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : చిలమత్తూరు సచివాలయం- 3 సంజీవరాయునిపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి పురుషోత్తమ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు నికేష్ హర్షమిత్ర వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాఘవేంద్ర రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మర్తాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజేంద్ర, నాగేంద్ర నాయక్, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, వైద్య ,సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘంలోని 11వ వార్డు మోడల్ కాలనీలో వార్డ్ కౌన్సిలర్ అంజలి అధ్యక్షతన లక్ష్మీపురం అర్బన్ హెల్త్ సెంటర్ లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ హారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేశారు. ఈ కార్యక్రమంలో రవితేజారెడ్డి, సచివాలయం అడ్మిన్ లోకేష్, ఎఎన్ఎం ఎర్రమ్మ, సెక్రెటరీస్ వరలక్ష్మి, రమేష్, శిల్పా, సాయి, ప్రభావతి, అంబిక, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ జీవనవిధానాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థి సైంటిఫిక్ జీవన విధానాన్ని అలవరచుకోవాలని జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు సూచించారు. స్థానిక సూర్యపాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ 33సంవత్సరాలుగా జేవీవీ విద్యార్థులలో సైంటిఫిక్ ఆలోచనను కలిగించి వాటి జీవన విధానాన్ని అలవరుచుకునేందుకు కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగా విద్యార్థులలో సైన్సు పట్ల ఇష్టాన్ని కల్గించడానికి ఆలోచనా శక్తిని పెంచడానికి జన విజ్ఞానవేదిక పనిచేస్తోందన్నారు. నవంబరు 10న పాఠశాలస్థాయి, 30న మండలస్థాయి, డిసెంబరు 17న జిల్లాస్థాయి, జనవరి 27న 28తేదీలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ చెకుముకి టెస్టులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8,9,10 తరగతులు చదివే విద్యార్థులకు నిర్వహించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల విద్యాభివృద్ధికి జేవీవీ చేస్తున్న కృషికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షులు వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షులు మహేంద్రరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్, నాయకులు హరి, రాజశేఖర్, బాలగంగాధర్నాయక్, లక్ష్మీనారాయణ, ఇమ్రాన్, నరేంద్రబాబు, లాయర్ హరిప్రసాద్, లోకేశ్, సురేశ్, రామాంజినేయులు, పర్వతయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వేగవంతంగా రీ సర్వే పనులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

రీ సర్వే పనులు వేగవంతంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆర్డీవోలు, సర్వే శాఖ అధికారులు, డిఐఒలు, ఇతర సర్వే శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో 26 గ్రామాలు, రెండవ దశలో 51 గ్రామాలు పూర్తికాగా మిగిలిన గ్రామాలలో వివిధ దశలలో ఉన్న రీసర్వే గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 20 గ్రామాలలో నోటిఫికేషన్ డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ జారీ చేయబడిందని తెలిపారు. సర్వే పనులు వేగవంతం చేసి నవంబర్ 10 లోగా పూర్తిచేయాలని జెసి ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కల్పించడానికి రీ సర్వే కార్యక్రమం అమలు చేస్తోందని అన్నారు. జిల్లాలో సర్వే టీంలు 125 గ్రామాలలో గ్రౌండ్ ట్రోటింగ్ వాల్యుయేషన్ను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అమలు చేయాలన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రీసర్వే కార్యక్రమంలో ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతున్నట్లు జెసి తెలిపారు. సర్వే పనులను అధికారులు అందరూ బాధ్యతగా తీసుకొని భూ వివాదాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే ద్వారా భూమి హద్దులు, సమస్యలు పక్కాగా నిర్ధారించవచ్చని జెసి తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మండలస్థాయిలో తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, తిప్పే నాయక్, సర్వే ల్యాండ్ ఏడీ రామకృష్ణ, ఆయా మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.


వైసిపిలో చేరుతున్న అశ్వర్థనారాయణ

వైసిపిలో చేరిన న్యాయవాది

మడకశిర రూరల్ : మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది అశ్వర్థనారాయణ వైసిపిలో చేరారు. ఈ మేరకు ఆయన తిరుపతిలోని వైసిపి కార్యాలయంవద్ద పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీని వీడి వైసిపిలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అశ్వర్థనారాయణ గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావి శేఖర్ రెడ్డి, నాయకులు వాగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎంపిపి

రొద్దం : క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపిపి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో గత వారం రోజుల నుండి నిర్వహిస్తున్న టి.10 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం ఫైనల్ పోటీ నిర్వహించారు. పెనుకొండ, రొద్దం జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో పెనుకొండ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఎంపిపి చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, పలువురు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కొత్తచెరువు : మండల పరిధిలోని లోచర్ల గ్రామంలోని బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నిడుమామిడి నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తూ కర్నాటక ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో నరేష్ భార్య అశ్విని (26) కుమారుడు చెర్రీ (7) తీవ్ర గాయాలపాలై మృతిచెందారు. నరేష్ గాయాలతో బయటపడ్డాడు. ఈ నేపథ్యంలో మృతదేహాలను బుధవారం లోచర్లకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న పల్లె రఘునాథ్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి మతదేహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్, సయ్యద్‌బాషా, బాబు, మాజీ సర్పంచికిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో వర్షాధార పంటగా సాగుచేసిన ఆముదం పంటలో అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. బుధవారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం రెవెన్యూ డివిజన్ ఉపగణాంకాధికారి గోపాల్, సహాయ గణాంకాధికారి కెవెస్ లక్ష్మీ నరసింహశర్మ, వీహెచ్‌ఎ సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని పులిమివాండ్లపల్లిలో వ్యవసాయశాఖ అధికారులు పంటకోత ప్రయోగాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భారతి, ఎఇఒకవిత, విహెచ్‌ఎలు షాదాబ్, భాస్కర్ నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

టూటౌన్ సిఐగా వలిబాషా

హిందూపురం : హిందూపురం టూ టౌన్ స్టేషన్ సిఐగా వలిబాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వలిబాషా ఉద్యోగోన్నతిలో భాగంగా హిందూపురం టూటౌన్ సిఐగా బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. స్టేషన్ లో విధుల నిర్వహిస్తున్న ఎస్ఐలు, ఎఎస్ఐలు, సిబ్బంది సిఐకు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని నడింబోటు కొండ వద్ద సోలార్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస మంగాపురం తిరుపతి శ్రీ లలితా పీఠ వ్యవస్థాపక పీఠాధిపతులు స్వరూప నందగిరి స్వాములు, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

సోమందేపల్లి : మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ ప్రదేశంలో సోమందేపల్లి పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ కొల్లప్ప అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ నాగభూషణం మాట్లాడుతూ షిప్పింగ్ కాల్ ద్వారా జరిగే మోసాలు, ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. బ్యాంకు లో కెసిసి అభియాన్ పథకం, పీఎం జేజే వై, పిఎం ఎస్‌బిఐ వల్ల ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంగపు సిఇఒ సి. జయరాములు, ఎడిసిసి బ్యాంక్ సూపర్‌వైజర్, సొసైటీ రైతులు, డిపాజిట్ దారులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

27న టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

మడకశిర : పట్టణంలో ఈనెల 27న జరిగే టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జులు, రాష్ట్ర కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రైతుల అన్ని రకాల రుణాలనూ మాఫీచేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సత్యసాయి జిల్లాలోని రైతులకు సంబంధించిన అన్ని రకాల రుణాలను వెంటనే మాఫీచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రైతుసంఘం నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయ ఎఒకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వేరుశెనగ పంట ఎకరాకు రూ.25వేలు పెట్టుబడిపెట్టి సాగు చేస్తే సకాలంలో వర్షాలు రాక చివరికి పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలోని 32 మండలాలను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సాగు చేసి పంటలు ఎండి పోయి నష్టపోయిన రైతులకు స్కిల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వేరుశెనగ, మొక్కజొన్న వంటి పంటలకు ఎకరానికి రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మల్బరీ రైతులకు రావాల్సిన ఇన్సెంటివ్ తక్షణం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మారుతి, వెంకటస్వామి, ఓబుళేశు, రామక్రిష్ణ, సీపీఎం పట్టణ కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : గాండ్లపెంట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతుసంఘం నాయకులు రాజారెడ్డి, ఖాదర్‌బాషా, గంగన్నల ఆధ్వర్యంలో నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ హమీద్‌బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు చెందిన అన్నిరకాల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

బత్తలపల్లి : సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలు పండక రైతులు నష్టపోయారనిప్రభుత్వం వెంటనే స్పందించి సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈమేరకు రైతుసంఘం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిఎస్‌డిటి శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా పంటల సాగు కోసం రైతులు పెట్టుబడి పెడుతున్నారే గాని దిగుబడి రాక పెట్టిన పెట్టుబడి కూడా దక్కక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్న ప్రభుత్వం నామమాత్రపు సాయం చేసి చేతులు దులుపుకుంటోందనివిమర్శించారు. పంటల సాగు కోసం చేసిన రైతులు చేసిన అప్పులన్నిటిని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పంట సాగు చేసిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు 50శాతం సబ్సిడీతో రుణాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ధర్మవరం డివిజన్ అధ్యక్షులు సాకే లక్ష్మన్న, నారాయణస్వామి, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిందూపురం : శ్రీ సత్య సాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, ఇప్పటివరకు రైతులు తీసుకున్న అన్ని రుణాలను మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు ఆందోళన చేసి, తహశీల్దార్ స్వర్ణలతకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జలసాధన సమితి నాయకులు గంగిరెడ్డి, పట్టు రైతు సంఘం నాయకులు జయరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లా లోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. హార్టికల్చర్ పంటలకు ఎకరానికి రూ.40వేలు ఇవ్వాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, రెడ్డప్పరెడ్డి, రామకృష్ణారెడ్డి, జమీల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో అరాచకపాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా వద్దు అనటానికి వంద కారణాలు ఉన్నాయని అదే జగన్ మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలో ఒక్క కారణం అయినా ఉందా అని ప్రశ్నించారు. నిజం గెలవాలి అన్న పేరుతో భువనేశ్వరి చేస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేస్తామని సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి,మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, అరుణ్ కుమార్ రెడ్డి, త్రివేంద్ర నాయుడు, ఇక్బాల్, దాదు, నాగభూణ, మంజునాథ్, రాజేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

ఇళ్లపట్టాల కోసం కొనసాగుతున్న ఆందోళన

ప్రజాశక్తి- చిలమత్తూరు

ఇళ్లపట్టాల కోసం పేదలు చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. ఈ ఆందోళన బుధవారానికి 38వ రోజుకు చేరుకుంది. గుడిసెలు వేసుకున్న సర్వేనెంబర్ 805 జగనన్న లేఅవుట్‌లో యధావిధిగా పేదలు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం మండల అధ్యక్షులు లక్ష్మి నారాయణ అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు.పోరాటంలో మరో అడుగు ముందుకు వేస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ రమణ, సిఐటియు వెంకటేష్, చందు, రహంతుల్లా, శివ, రియాజ్, మణి, వేణు, సదాశివరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సత్యసాయి జయంతి వేడుకలకు

అభివృద్ధి పనులు పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్య సాయి బాబా జయంతి వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో పుట్టపర్తిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా డ్రయినేజీ, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు తదితర పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వచ్చే నెల నవంబర్ 23న జరిగే సత్యసాయి బాబా జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వపరంగా తగిన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసే దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. త్వరలోనే జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మీనారాయణ రెడ్డి, తిప్పన్న, పార్టీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డిఇ నరసింహమూర్తి, ఎఇ స్వాతి, నెట్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు భాస్కర్ రెడ్డి, సాయి గీత, అనిత శంకర్, శ్రీనివాసులు, సతీష్ నాయుడు, రమణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కేరళ సంగీత వాయిద్యం

ప్రజాశక్తి బత్తలపల్లి

దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఊరేగింపు అనంతరం భక్తుల నడుమ నిమజ్జనానికి తరలించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాల అలంకరణలో కొలువుదీరిన దుర్గామాత దసరా శరన్నవరాత్రుల ప్రారంభమైనప్పటి నుండి దాదాపు పది రోజులపాటు వివిధ రూపాల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం సాయంకాలం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం నుండి భారీ వాహనంపై ఊరేగింపుగా ప్రధాన రహదారుల వెంబడి తీసుకువచ్చారు. కేరళ సంగీత వాయిద్యాలతో పాటు డప్పుల మోత, ఉరుముల శబ్దాలు, బాణసంచా మెరమిట్లు మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి చిత్రావతి నదిలో నిమజ్జనం చేశారు.

ఇసుక తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో రొద్దంలో చావిడి వద్ద పెద్ద ఎత్తున పేరుకుపోయిన ఇసుకను పంచాయతీ అధికారులు తొలగించారు. మూడు రోజుల క్రితం ప్రజాశక్తి దినపత్రికలో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన ఇసుక అనే శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బంది రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను బుధవారం తొలగించారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


ఇసుక తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

27న జాబ్‌మేళా

ప్రజాశక్తి - హిందూపురం

ఈనెల 27న పట్టణంలోని బాల యేసు డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమర్థనం వికలాంగుల సంస్థ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 10 వతరగతి, ఇంటర్, డిగ్రీ, పిజి విద్యార్థులు కలిగి, 18-32 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9949807396, 9550394432, 9353676960, 6305334287 సెల్‌నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : మండలంలో నాలుగు రోజుల పాటు మొబైల్ ఆధార్ వారోత్సవాల క్యాంపును నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిమనోహర్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 25న తంబాపురం, సంజీవపురం, 26న అప్పరాచెరువు, పోట్లమర్రి, బత్తలపల్లి, 27న రామాపురం, డి.చెర్లోపల్లి మాల్యవంతం, 28న దంపెట్ల, సంజీవపురం, ఈదులముష్టూరు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో కొనసాగుతున్న సెబ్ తనిఖీలు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో సెబ్ సిబ్బంది అక్రమ మద్యంపై దాడులను జిల్లాలో కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం హిందూపురం సెబ్‌స్టేషన్ పరిధిలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 48 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధి లో పుట్టకుంటపల్లిలో నిందితుడి వద్ద ఉన్న 12 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కదిరి సెబ్‌స్టేషన్ పరిధిలో నిందితుడిని అరెసు చేసి 28 కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఎపిఐఐసి ద్వారా చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆసంస్థ జోనల్ మేనేజర్ సుహానాసోని అన్నారు. బుధవారం కదిరి రూరల్ మండలం కదిరి పారిశ్రామిక వాడలో శ్రీ సత్య సాయి జిల్లా ఎపిఐఐసి లిమిటెడ్ జోనల్ మేనేజర్ సువానాసోని పర్యటించారు. సిల్క్ రీలర్స్ వారి జాగా క్రమబద్ధీకరణకు ఏర్పాటు చేసిన కె ఎస్ బహవుద్దీన్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ 35 సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న సిల్క్ రీలర్స్ స్థలాలను, భవనాన్ని క్రమబద్ధీకరణ చేయడానికి తమ సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఉత్తర్వులు వచ్చేందుకు సహకరించిన ఏపీఐఐసీ లిమిటెడ్ చైర్మన్ శ్రీ మెట్టు గోవింద్ రెడ్డి, మైనారిటీ వెల్ఫేర్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఇంతియాజ్, ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులు జనాబ్ జియావుద్దీన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి శ్రీ సత్యసాయి జిల్లా డిప్యూటీ జోనల్ మేనేజర్ మల్లికార్జున, ఐలా చైర్మన్ టిఎం నౌషాద్ బాషా, డిక్కీ రమణ, డాల్ మిల్ టి ఎం రఫిక్, ఐలా డైరెక్టర్ అప్పుల్లా, సిల్క్ రిలర్స్ ఇలియాజ్, చౌదరి, మహబూబ్ బాషా, బాబ్జాన్, పీరా, హైదర్ వలి తదితరులు పాల్గొన్నారు

జనసేనతో కలిసి ముందుకెళ్తాం

మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి,కదిరి టౌన్

జనసేన పార్టీతో కలసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చంద్రబాబు అక్రమ అరెస్టు, నిరసన కార్యక్రమాలు, రైతాంగం పడుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. సమావేశం అనంతరం జనసేన పార్టీ నాయకులతో కలిసి భవిష్యత్ కార్యక్రమం ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశానికి టిడిపి శ్రేణులతో పాటు రైతాంగం తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

పెనుకొండ : మండల పరిధిలోని నాగలూరు గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాలు... నాగలూరు గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు హరిచంద్ర (28)ఇటుకల పరిశ్రమలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొంతకాలంగా తన గురించి ఇంట్లో వారు పట్టించుకోవడంలేదని మనోవేదనకు గురయ్యాడు. ఈ మేరకు మంగళవారం రాత్రి పొలంలోకి వెళ్తానని చెప్పి వెంకటప్ప వ్యవసాయ పొలంలోని కానుగ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

పాఠశాల బస్సులో షార్ట్ సర్క్యూట్

లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం టోల్ ప్లాజా వద్ద బుధవారం ఓ ప్రవేటు పాఠశాల బస్సులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పొగలు వచ్చాయి. దీంతో బస్సు డ్రైవర్ పరుగులు తీశాడు. బస్సులో ఉన్న ఆరుగురు పిల్లలు భయంతో గట్టిగా అరవడంతో స్థానికులు, టోల్ ప్లాజా సిబ్బంది పిల్లలను బయటకు తీసుకువచ్చారు. బస్సులోని బ్యాటరీ వైర్లు తొలగించారు.


ప్రమాదానికి గురైన బస్సు

క్రీడలతో మానసికోల్లాసం

మడకశిర : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని గుడిబండ సర్పంచికరుణాకర్ గౌడ్, జెడ్పీటీసీ భూతరాజు తెలిపారు. పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా గుడిబండలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచి కరుణాకర్ గౌడ్ మాట్లాడుత పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పోలీసులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచి

టూటౌన్ సిఐగా అశోక్‌కుమార్

ధర్మవరం టౌన్: ధర్మవరం పట్టణ టూటౌన్ సిఐగా అశోక్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ రాజా బదిలీపై కడపకు వెళ్లారు. అప్పటి నుంచి వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం ఇన్‌ఛార్జ్ సిఐగా బాధ్యతలు కొనసాగించారు. ఈ క్రమంలో పుంగనూరు నియోజకవర్గం గంగవరం నుంచి అశోక్ కుమార్ బదిలీపై ధర్మవరానికి వచ్చారు. ఈయనకు టూటౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

అమరాపురం : మండల పరిధిలోని మద్దనకుంట గ్రామానికి చెందిన గిరి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, జయరామిరెడ్డి, మాజీ వైస్ మున్సిపల్ చైర్మన్ పరమేష్, తాలూకా రైతు సంఘం అధ్యక్షులు రాజగోపాల్, మాజీ మండల్ కన్వీనర్ రామాంజనేయులు, కష్టప్ప, కరియన్న, శ్రీనివాసులు, నరేష్, గంగాధర్, రంగనాథ్, నాగరాజు, రామాంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం కాలువేపల్లిలో చేపట్టిన కళ్యాణ మండపం నిర్మాణానికి దాత లక్ష రూపాయలు విరాళం అందించారు. గ్రామంలో లక్ష్మి రంగనాథ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి జిరిగేపల్లి గ్రామానికి చెందిన భోజన్న తనవంతుగా లక్ష రూపాయలు విరాళామందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, శ్రీ రంగప్ప, తిమ్మప్ప, సిద్ధప్ప, రమేష్, అర్చకులు తెలిపారు. భోజన్న వృత్తిరీత్యా తుమకూరులో పట్టు పరిశ్రమ శాఖ ఏడీగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయన తన వంతుగా లక్ష రూపాయలు విరాళం అందించడం పట్ల ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


విరాళం అందజేస్తున్న దాత

అక్రమ లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు

ముదిగుబ్బ : పట్టణ శివారులోని గుంజేపల్లి పొలం పరిధిలో సర్వేనెంబర్ 823లో సుమారు 95 సెంట్ల స్థలంలో వేసిన అక్రమ లేఅవుట్‌కు సంబంధించిన రాళ్లను అధికారులు బుధవారం తొలగించారు. ఈసందర్భంగా తహశీల్దార్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించినా, ప్రభుత్వ స్థలాలలో అక్రమ లేఅవుట్లు వేసి విక్రయానికి ప్రయత్నించిన సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుంజేపల్లి పొలం పరిధిలో అక్రమ లేఅవుట్‌లో సర్వే నిర్వహించి అక్రమంగా వేసిన బోరును సీజ్ చేశామని, సరిహద్దు రాళ్లను తొలగించామని చెప్పారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం తమ బాధ్యత అని అన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో వినూత్న నిరసన

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ సత్యసాయిబాబా జయంతి వేడుకలు సమీపిస్తున్నా ఇప్పటివరకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు పనులు చేయలేదన్నారు. అందుకు నిరసనగా నాయకులతో కలిసి చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బాబా జయంతి వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఆదినారాయణ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామాంజులు నాయుడు, నాయకులు రామాంజి, మూర్తి, గంగాద్రి, తదితర నాయకులు నాయకులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పనిచేయండి

పుట్టపర్తి రూరల్ : సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం ఏర్పడే విధంగా ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. హిందూపురం టూ టౌన్, ధర్మవరం టూ టౌన్ సిఐలుగా వలీబాషా, అశోక్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో వారు బుధవారం ఎస్పీ చాంబర్లో, జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ మాధవ్ రెడ్డి వారికి సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుట్టపర్తి రూరల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలో ఉన్న పాఠశాలలో పోలీసులకు సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ పోటీలను నిర్వహించినట్లు పోలీసు అధికారులు చెప్పారు.

పోస్టర్లు విడుదల

గోరంట్ల రూరల్ : ఈ నెల 29న గుంటూరు వేదికగా నిర్వహించే దుదేకుల సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను గోరంట్ల లో బుధవారం దూదేకుల సామాజికవర్గం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడెకంటి హైదర్ వలీ మాట్లాడుతూ నూర్ బాషా, దుదేకుల ముస్లిం సంఘం అధ్వర్యంలో పోరాటానికి సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టైలర్ బాబు, హుస్సేన్ పీరా, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.